క్లుప్తంగా

9న జీపుల వేలం

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రాజమహేంద్రవరంలోని జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి కార్యాలయంలో ఈనెల 9వ తేదీ ఉదయం 11 గంటలకు రాజమహేంద్రవరం, కొవ్వూరు పశుసంవర్ధకశాఖ ఉపసంచాలకులు రెండు జీపుల వేలం నిర్వహిస్తున్నారు. ఈ మేరకు జిల్లా పశుసంవర్ధకశాఖాధికారి డాక్టర్ ఎస్‌టీజీ సత్యగోవిందు శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. వేలంలో పాల్గొనే వారు రూ.5 వేలు ధరావత్తు చెల్లించాలన్నారు. వేలం సొమ్ముకు అదనంగా 18 శాతం జీఎస్‌టీ కట్టాలన్నారు. జీపులను పరిశీలించడానికి కార్యాలయం పనివేళల్లో ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అధికారులను సంప్రదించాలన్నారు.

వైభవంగా పోలేరమ్మ తీర్థం

కడియం: దుళ్ల గ్రామదేవత పోలేరమ్మ తీర్థమహోత్సవం శుక్రవారం వైభవంగా జరిగింది. రెండు రోజులుగా గ్రామస్తులు, దాతల సహకారంతో కన్నుల పండువగా జాతర నిర్వహించిన విషయం తెలిసిందే. ఏటా వైశాఖ పౌర్ణమి నాడు అమ్మవారి తీర్థం నిర్వహించడం ఆనవాయితీ. అందులో భాగంగా శుక్రవారం ఉదయం నుంచీ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. గ్రామానికి చెందిన మహిళలు, ఆడపడుచులు తరలివచ్చి, అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

జీరో ప్లాస్టిక్ మార్కెట్‌గా అల్లూరి జంక్షన్

రాజమహేంద్రవరం సిటీ: అల్లూరి సీతారామరాజు జంక్షన్‌ను జీరో ప్లాస్టిక్ మార్కెట్‌గా తయారు తయారు చేసేందుకు కృషి చేస్తున్నట్లు డివూన్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్రాజెక్టు మేనేజర్ ధనేకుల లావణ్య తెలిపారు. నగరపాలక సంస్థ కమిషనర్ దినేష్‌కుమార్ ఆదేశాలతో జాంపేట చిన్నగాంధీ బొమ్మ జంక్షన్ నుంచి అల్లూరి సీతారామరాజు కూడలి వరకూ మార్కెట్‌ను జీరో ప్లాస్టిక్‌గా తయారు చేస్తామన్నారు. ఇందుకోసం రైతుబజారులోని రైతులు, వ్యాపారులు, సైకిల్ వ్యాపారులు, షాపు యజమానులకు అవగాహన కల్పించేందుకు కార్యక్రమం చేపట్టామన్నారు. ప్రతిషాపు వద్ద తప్పని సరిగా డస్ట్‌బిన్ ఏర్పాటు చేసుకోవాలని, ప్లాస్టిక్ కవర్లు వినియోగించవద్దని అవగాహన కల్పించారు.

అన్నమాచార్యుల జయంత్యుత్సవం



నృత్య కళాకారులకు మెమెంటోలు బహూకరిస్తున్న షర్మిలారెడ్డి

సీటీఆర్ఐ: తాళ్లపాక అన్నమాచార్యుల జయంత్యుత్సవం, సంగీత నృత్య సంగీత ఆరాధనోత్సవాలు శుక్రవారం స్థానిక పుష్కరఘాట్‌లో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా అన్నమాచార్యుల విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. రుడా చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి మాట్లాడుతూ సామాన్యులకు సైతం అర్థమయ్యేలా అన్నమయ్య కీర్తనలు ఆలపించారన్నారు. మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు, వాకచర్ల కృష్ణ, కోఆపరేటివ్ బ్యాంక్ డైరెక్టర్ ఆందనపల్లి సత్యనారాయణ, పెద్దిరెడ్ల శ్రీనివాసు, తలుపూరి ప్రసాద్, చెక్క నవీన్ తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ

ప్రకాశం నగర్: వాకర్స్ యోగా లాఫింగ్ క్లబ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ఎస్‌కెవీటీ కళాశాల ఆనంద గార్డెన్స్‌లో క్లబ్ అధ్యక్షుడు శనపతి సత్తిబాబు అధ్యక్షతన పింఛన్ల పంపిణీ జరిగింది. కార్యక్రమానికి కోట్ల గోపి, కోట్ల దుర్గా ప్రసాద్, రొక్కం అప్పారావు, సూరపురెడ్డి తాతారావు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. 80 మంది వృద్ధులకు రూ.500 చొప్పున రూ.40 వేలు పింఛన్లుగా వృద్ధులకు పంపిణీ చేశారు. జర్నలిస్టు వారణాసి సుబ్రహ్మణ్యం కుమార్తె వారణాసి కామేశ్వరి రూ.15 వేలను పేద విద్యార్థుల కోసం అందించారు. కార్యక్రమంలో క్లబ్ వ్యవస్థాపకుడు పామర్తి గోపాలరావు, కార్యదర్శి గుబ్బల గంగాభవాని పాల్గొన్నారు.

తంటికొండ వెంకన్నకు శ్రీచక్రస్నానం

గోకవరం: మండలంలోని తంటికొండలో వేంచేసిన శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి వారి శ్రీచక్రస్నానం, గ్రామోత్సవాలు శుక్రవారం వైభవంగా జరిగాయి. స్వామి వారి కళ్యాణోత్సవాల్లో భాగంగా ఐదో రోజు ఉదయం మహా పూర్ణాహుతి, చక్రస్నానం, ధ్వజారోహణ తదితర పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. జెడ్పీటీసీ దాసరి శ్రీరంగ, వైఎస్సార్ సీపీ సచివాలయ మండల కన్వీనర్ దాసరి రమేష్ దంపతులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి గరుడ వాహనంపై స్వామి వారి గ్రామోత్సవం కన్నులపండువగా జరిగింది. మేళతాళాలు, బాణసంచా కాల్పులు, వివిధ వేషధారణల నడుమ స్వామివారి గ్రామోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఘనంగా తీర్థ మహోత్సవం

బిక్కవోలు: బిక్కవోలు మండలం పందలపాకలో కొలువైయున్న కట్లమ్మ తల్లి వార్షిక తీర్థ మహోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు.

వేసవి వేళ.. శిక్షణ భళా..

- ఉత్సాహంగా క్రీడా తరగతులు
- ఆసక్తి చూపుతున్న చిన్నారులు



బాక్సింగ్‌లో శిక్షణ పొందుతున్న విద్యార్థులు



బాస్కెట్ బాల్‌లో శిక్షణ పొందుతున్న పిల్లలు

ప్రకాశం నగర్: చదువుల్లో అలసిన విద్యార్థులకు వేసవి సెలవుల్లో ఆయా క్రీడా మైదానాల్లో ఏర్పాటు చేసిన క్రీడా శిక్షణ శిబిరాలు శిక్షణతో పాటు ఆనందం కలిగిస్తున్నాయి. జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) ఆధ్వర్యంలోని 51 సెంటర్లలో సుమారు 20 క్రీడల్లో విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నారు. వీటిలో రాజమహేంద్రవరం అర్బన్ పరిధిలోని ఆర్ట్స్ కళాశాల క్రీడా మైదానంలో అథ్లెటిక్స్, బాస్కెట్ బాల్, కబడ్డీ, టెన్నికాయిట్, ఎస్‌కేవీటీ కళాశాల మైదానంలో బాస్కెట్ బాల్, ఫుట్‌బాల్, హ్యాండ్ బాల్, ఏకేసీ కళాశాలలో బాక్సింగ్, కిక్ బాక్సింగ్, ఆర్చరీ, ఏపీ పేపర్ మిల్లు మల్లయ్య పేట స్కూల్లో బాస్కెట్ బాల్, గౌతమ ఘాట్ ఇస్కాన్ టెంపుల్ వద్ద కరాటే, డీఎంహెచ్ఎస్ పాఠశాల క్రీడా మైదానంలో బాస్కెట్ బాల్, కబడ్డీ, ఎస్ఎస్ఏ మున్సిపల్ స్కూల్లో కబడ్డీ, ఖోఖో, యోగా, శ్రీనివాసా రామానుజన్ మున్సిపల్ స్కూల్లో యోగాలో శిక్షణ ఇస్తున్నారు. సుమారు నెల రోజుల పాటు పీడీలు, పీటీల పర్యవేక్షణలో ఇచ్చే ఈ శిక్షణలో బ్యాచ్‌కు సుమారు 20 నుంచి 30 మంది పిల్లలు శిక్షణ పొందుతున్నారు.

వాలీబాల్

వేసవి క్రీడా శిక్షణలో భాగంగా చిన్నారులతో పాటు పెద్దలకు కూడా వాలీబాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆర్ట్స్ కళాశాల మైదానంలోని పరిమి రామచంద్రరావు వాలీబాల్ కోర్టులో వాలీబాల్‌లో శిక్షణ ఇస్తున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో రెండు బ్యాచ్‌లు నిర్వహిస్తున్నారు.

బాస్కెట్ బాల్

సిటీ బాస్కెట్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నుంచి జూన్ 11 వరకు వేసవి శిక్షణ శిబిరం ఏర్పాటు చేయనున్నారు. ఎస్‌కేవీటీ డిగ్రీ కళాశాలలో ప్రతి రోజు ఉదయం 5.30 నుంచి 8.30 వరకూ, సాయంత్రం 5 నుంచి 7 గంటల వరకు రెండు బ్యాచ్‌ల్లో ఈ శిక్షణ ఇవ్వనున్నారు.

పద్యాలు, స్పోకెన్ ఇంగ్లిష్

సీతంపేట గ్రంథాలయంలో విద్యార్థులకు ఈనెల 8 నుంచి తెలుగు పద్యాలు, స్పోకెన్ ఇంగ్లిష్, చిత్రలేఖనం, పాటలు, క్రాఫ్ట్ బొమ్మల తయారీ వంటి ప్రత్యేక నైపుణ్య శిక్షణపై తరగతులు నిర్వహించనున్నారు. ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ ఈ శిక్షణ జరుగుతుంది. సుమారు నెల రోజుల పాటు జూన్ 11 వరకూ కొనసాగుతుంది. రామకృష్ణ మిషన్ వంటి సంస్థలు చిన్నారులకు నృత్యం, యోగాలో శిక్షణ ఇస్తున్నాయి.

సద్వినియోగం చేసుకోవాలి



వేసవి క్రీడా శిక్షణ శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. ఇక్కడ నేర్పించే మెలకువలు జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనే సమయంలో క్రీడాకారులకు ఎంతగానో ఉపయోగపడతాయి. పిల్లల్లో మానసిక ఒత్తిడి తగ్గడంతో పాటు శారీరక దృఢత్వం పెరుగుతుంది.

– డీఎంఎం శేషగిరి, జిల్లా చీఫ్ కోచ్

ఆర్టీసీలో మల్టీ లెగ్ ట్రావెల్ టికెట్ సదుపాయం

రాజమహేంద్రవరం సిటీ: దూర ప్రాంతాలు వెళ్లాల్సిన ప్రయాణికులకు డైరెక్ట్ సర్వీసు లేకపోతే ఒకే టికెట్‌పై కనెక్టింగ్ బస్సుల్లో ప్రయాణించేలా మల్టీ లెగ్ ట్రావెల్ టికెట్ (ఎంఎల్‌టీటీ) సదుపాయం కల్పిస్తున్నట్లు రాజమహేంద్రవరం డిపో మేనేజర్ షేక్ షబ్నం తెలిపారు. ప్రస్తుతం ప్రయోగాత్మకంగా రాజమహేంద్రవరం నుంచి అనంతపురం, కుప్పం, రాయచూర్ వెళ్లడానికి ఈ సదుపాయం కల్పించామన్నారు. రిజర్వేషన్ టికెట్‌కు అయ్యే సర్వీసు చార్జీ ఎంఎల్‌టీటీ టికెట్‌కు అవుతుందన్నారు. ఉదాహరణకు రాజమహేంద్రవరం నుంచి కుప్పం వెళ్లాలంటే డైరెక్ట్ బస్సు రాజమహేంద్రవరం నుంచి లేనందున.. ఎంఎల్‌టీటీ టికెట్ కొనుగోలు చేసి రాజమహేంద్రవరం నుంచి విజయవాడకు వెళ్లి అదే టికెట్‌తో విజయవాడ నుంచి కుప్పం బస్సులో ప్రయాణించవచ్చన్నారు. ఈ పథకం విజయవంతమైతే మరిన్ని ప్రాంతాలకు అమలు చేస్తామని ఆమె తెలిపారు.

గంజాయి తాగుతున్న ముగ్గురి అరెస్టు

కంబాలచెరువు: స్థానిక గూడ్స్‌గేట్ సమీపంలో గంజాయి తాగుతున్న పి.సాయికృష్ణ, రామకృష్ణ, సాయిమణికంఠను రెండో పట్టణ పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. వారినుంచి 9.60 గ్రాముల గంజాయిని పట్టుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ఠాపన







స్వామిని దర్శించుకున్న ఎంపీ మార్గాని భరత్ రామ్, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా, కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్

కడియం: స్థానిక భ్రమరాంబికా మల్లేశ్వరస్వామి ఆలయం వద్ద నిర్మించిన గోశాలలో మందిరం, శ్రీకృష్ణ భగవానుని విగ్రహ ప్రతిష్ఠాపన శుక్రవారం వైభవంగా జరిగింది. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి గిరజాల వీర్రాజు (బాబు), ఆర్యాపురం అర్బన్ బ్యాంకు చైర్ పర్సన్ గిరజాల రామకృష్ణ తులసి చేతుల మీదుగా వేద పండితుల పర్యవేక్షణలో విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. వైఎస్సార్ సీపీ పార్లమెంట్ చీఫ్ విప్, రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్ రామ్, రూరల్ కో ఆర్డినేటర్, ఏపీ గ్రీనింగ్, బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, రుడా చైర్ పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆంధ్రా పేపర్‌మిల్లు యాజమాన్యం గోశాల, కృష్ణ మందిరం నిర్మించి, విగ్రహం ఏర్పాటు చేయడంపై అభినందించారు. ప్రముఖులకు భ్రమరాంబికా మల్లేశ్వరస్వామి ఆలయ కమిటీ, గోసంరక్షణ సేవాసమితి సభ్యులు, ప్రజాప్రతినిధులు, నాయకులకు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్రకార్యదర్శి రావిపాటి రామచంద్రరావు, ఎస్పీ శ్రీనివాస్, మండల అధ్యక్షుడు యాదల సతీష్‌చంద్ర స్టాలిన్, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఈలి గోపాలం, శాప్ డైరెక్టర్ భీమిరెడ్డి నాగేంద్ర, కొత్తపల్లి మూర్తి పాల్గొన్నారు.

మాయావతి సభను విజయవంతం చేయాలి

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): హైదరాబాద్‌లో ఆదివారం జరిగే బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ) అధినేత్రి మాయావతి బహిరంగ సభను విజయవంతం చేయాలని బీఎస్పీ తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు పట్నాల విజయ కుమార్ పిలుపునిచ్చారు. స్థానిక బీఎస్పీ కార్యాలయంలో శుక్రవారం చలో హైదరాబాద్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. విజయ కుమార్ మాట్లాడుతూ హైదరాబాద్ సభకు బీఎస్పీ నాయకులు, కార్యకర్తలు తరలి రావాలని కోరారు. బహుజనులకు రాజ్యాధికారం కోసం, బీఎస్పీ వ్యవస్థాపకుడు కాన్షీరామ్ ఆశయాలు నెరవేర్చడానికి కృషి చేస్తున్న పార్టీ అధ్యక్షురాలు మాయావతికి బహుజనులు మద్దతు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో బీఎస్పీ రూరల్ ఉపాధ్యక్షుడు కొండపల్లి సూరిబాబు, రూరల్ వార్డు ఇన్‌చార్జి కొత్తపల్లి శేఖర్, నెల్లి సుబ్బారావు, గెడ్డం ప్రసాద్, మెండ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

సర్దార్ పాపన్న గౌడ్ స్ఫూర్తితో పయనిద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ మార్గాని భరత్‌రామ్

- ఈ నెల 14న కొవ్వూరులో విగ్రహావిష్కరణ
- ఎంపీ భరత్ రామ్

రాజమహేంద్రవరం రూరల్: భారత దేశ తొలి బహుజన చక్రవర్తి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహ ఆవిష్కరణ మహోత్సవం ఈనెల 14న కొవ్వూరు నుంచి దొమ్మేరు రోడ్డులో ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద (కొవ్వూరులో) అత్యంత భారీ ఎత్తున నిర్వహిస్తున్నట్టు వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ చీఫ్ విప్, ఎంపీ మార్గాని భరత్ రామ్ తెలిపారు. శుక్రవారం వీఎల్ పురం మార్గాని ఎస్టేట్స్ ప్రాంగణంలోని ఎంపీ కార్యాలయంలో విగ్రహావిష్కరణ సన్నాహక సమావేశం నిర్వహించారు. రాష్ట్ర బీసీ జేఏసీ చైర్మన్ మార్గాని నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీ భరత్ ముఖ్య అతిథిగా, రాష్ట్ర గౌడ సంఘ అసోసియేషన్ అధ్యక్షుడు తాతా కృష్ణారావు, ఆ సంఘ వర్కింగ్ ప్రెసిడెంట్ మట్టా వీరబాబు గౌడ్ విశిష్ట అతిథులుగా విచ్చేశారు. ఎంపీ భరత్ మాట్లాడుతూ కొవ్వూరు ఫ్లైఓవర్ బ్రిడ్జి సమీపంలో గంగ్రోతు కోదండ రామారావు స్థలంలో నెలకొల్పే పాపన్న గౌడ్ విగ్రహావిష్కరణ మహోత్సవానికి ప్రతి కుటుంబం కదలి రావాలన్నారు. రాష్ట్ర గౌడ సంఘం అసోసియేట్ అధ్యక్షుడు, రాష్ట్ర బీసీ సేన ప్రధాన కార్యదర్శి తాతా కృష్ణారావు మాట్లాడుతూ ఈనెల 14న మధ్యాహ్నం 3 గంటలకు పాపన్న గౌడ్ విగ్రహావిష్కరణకు ఎంపీ మార్గాని భరత్ రామ్, మంత్రులు తానేటి వనిత, జోగి రమేష్ విచ్చేస్తున్నారన్నారు. సమావేశంలో గౌడ సంఘం నాయకులు బుడ్డిగ శ్రీనివాస్, మట్టా శ్రీనివాస్, మట్టా వెంకట్రావు, మన్యం సూరిబాబు, ముప్పిడి నాగేశ్వరరావు, కృష్ణారావు, రేలంగి వీర వెంకట సత్యనారాయణ పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ లెక్చరర్ల వినతి

సీటీఆర్ఐ: తమ సర్వీసు క్రమబద్ధీకరణ త్వరితగతిన చేపట్టాలని కాంట్రాక్ట్ లెక్చరర్ల అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గొర్ల మాణిక్యం.. ఎంపీ మార్గాని భరత్‌రామ్‌ను కోరారు. స్థానిక శుభమస్తు కల్యాణ మండపంలో శుక్రవారం జరిగిన జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశానికి భరత్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ భరత్‌కి వినతి పత్రం అందజేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 142, 143 జీవో ద్వారా జూనియర్, డిగ్రీ కళాశాలల్లో కాంట్రాక్ట్ లెక్చరర్లగా తామంతా ఒకేసారి చేరామన్నారు. తమతో పాటు చేరిన సహచర తెలంగాణ కాంట్రాక్ట్ లెక్చరర్ల సర్వీసును రెగ్యులరైజ్ చేస్తూ తెలంగాణ ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసిందన్నారు.

25 శాతం రిజర్వేషన్ అమలు చేయాలి

ప్రకాశం నగర్: ప్రైవేట్ విద్యాసంస్థల్లో పేదలకు 25 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని పేరెంట్స్ టీచర్స్ అండ్ స్టూడెంట్స్ యునైటెడ్ ఫెడరేషన్ అధ్యక్షుడు వేణు అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజ్యాంగంలో ఆర్టికల్ 21 ఏ ప్రకారం 6 నుంచి 14 ఏళ్ల వయసున్న విద్యార్థులకు ఉచిత నిర్బంధ విద్య అందించాలని, పేదలకు రిజర్వేషన్ కల్పించాలని స్పష్టంగా ఉందన్నారు. వీధి బాలలు, హెచ్ఐవీ బాధిత బాలలతో పాటు ఎస్సీ, బీసీ, ఎస్టీ అగ్రవర్ణాల పేదలకు 25 శాతం రిజర్వేషన్ కల్పించాలని సుప్రీంకోర్టు చెప్పినప్పటికి ప్రైవేట్ విద్యాసంస్థలు అమలు చేయడం లేదన్నారు. ప్రైవేటు స్కూళ్లు, కాలేజీలు, కార్పొరేట్ విద్యాసంస్థల్లో అధిక ఫీజులను నియంత్రించడానికి తమ యూనియన్ కృషి చేస్తుందన్నారు. సమావేశంలో అసోసియేషన్ కోశాధికారి మున్నీసా బేగం షేక్, వెంకటరత్నం రాజు, కుమార్ బాబు పాల్గొన్నారు.

కుమార్తె వైద్యం కోసం ముఖ్యమంత్రికి లేఖ

ప్రకాశం నగర్: నగరానికి చెందిన పుట్టా వీర వెంకట లక్ష్మీనారాయణ తన కుమార్తె సాయి దీపిక వైద్యానికి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థికసాయం అందజేసి, ఆమెకు ప్రాణభిక్ష పెట్టాలని అభ్యర్థిస్తూ శుక్రవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి లేఖ రాశాడు. వివరాల్లోకి వెళితే.. లక్ష్మీనారాయణ భార్య, ఇద్దరు కుమార్తెలతో స్థానిక మున్సిపల్ కాలనీలో నివాసం ఉంటున్నాడు. ట్రాన్స్‌పోర్టు వ్యాపారం నిర్వహిస్తూ జీవనోపాధి పొందుతున్నాడు. ఆయన పెద్ద కుమార్తె, 22 ఏళ్ల సాయి దీపిక బీటెక్ పూర్తి చేసింది. మూడేళ్లుగా అనారోగ్య సమస్యతో బాధపడుతోంది. ఆమెకు సికింద్రాబాద్‌లోని యశోదా ఆసుపత్రిలో వైద్యపరీక్షలు నిర్వహించగా, రెండు ఊపిరితిత్తులూ 50 శాతం పైగా పాడైపోయాయని, ఊపిరితిత్తుల మార్పిడియే ఏకైక మార్గమని వైద్యులు సూచించారు. ఇందుకోసం సుమారు రూ.33.50 లక్షలు ఖర్చు అవుతుందన్నారు. ఇప్పటి వరకు చాలా ఖర్చు చేసి ఉన్న లక్ష్మీనారాయణకు అంత సొమ్ము ఖర్చు చేసి వైద్యం అందించే స్తోమత లేదు. దీంతో ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా సాయం చేయాలని ముఖ్యమంత్రిని కోరాడు.

ప్రయాణం.. ఆహ్లాదం

- జాతీయ రహదారి 516ఈ అభివృద్ధి
- రాజమహేంద్రవరం నుంచి విజయనగరం వరకూ హ్యాపీ జర్నీ



జాతీయ రహదారి 516ఈ పై ప్రయాణికుల రాకపోకలు

మధురపూడి: రాజమహేంద్రవరం నుంచి విజయనగరం వరకూ నిర్మించిన 516ఈ జాతీయ రహదారిపై ప్రయాణం రయ్‌రయ్‌మంటూ సాగుతోంది. గతంలో రాష్ట్రీయ రహదారిగా పిలువబడిన దీనికి జాతీయ రహదారి గుర్తింపు వచ్చింది. వెనువెంటనే ప్రయాణానికి మరింత వీలుగా అభివృద్ధి చేయబడింది. రహదారికి ఇరువైపులా ప్రమాద సూచికలు, చేరాల్సిన గమ్యం వివరాలు తెలుపుతూ బోర్డులు, అనుసంధానించిన రోడ్ల వద్ద సిగ్నల్ వ్యవస్థ ఏర్పాటు చేశారు. గతంలో ఎయిర్‌పోర్టు రోడ్డుగా, తర్వాత రాష్ట్రీయ రహదారిగా పిలువబడే ఈ రోడ్డు ఇప్పుడు జాతీయ రహదారి 516ఈగా అభివృద్ధి చెందింది. రాజమహేంద్రవరం నుంచి మధురపూడిలోని విమానాశ్రయం వరకూ అభివృద్ధి చెందిన ఈ రహదారి జాతీయ హోదాతో రంపచోడవరం సమీపంలోని పోలవరం, కాకరపాడు జంక్షన్ (కొయ్యూరు), చింతపల్లి, లంబసింగి, జి.మాడుగల, పాడేరు, అరకు, తాడిపూడి మీదుగా విజయనగరం చేరుతుంది. ఈ రోడ్డు ఏజెన్సీ ప్రాంతం మీదుగా వెళుతుండడంతో దీనిపై ప్రయాణం ఆహ్లాదంగా ఉంటుంది.

అభివృద్ధి ఇలా..

జాతీయ రహదారి 516 ఈ అభివృద్ధి, విస్తరణ పనులు చురుకుగా జరిగాయి. ఇది తూర్పుగోదావరి, అల్లూరి సీతారామరాజు జిల్లాల మీదుగా విజయనగరం చేరుతుంది. కోరుకొండ మండలం బూరుగుపూడి అయ్యన్న గళ్ల కాలువ వంతెన నుంచి అల్లూరి సీతారామరాజు జిల్లా ఐ.పోలవరం వరకూ 43.7 కిలోమీటర్ల మేర విస్తరించబడింది. ఐ. పోలవరం నుంచి మరో 70 కిలోమీటర్ల మేర నిర్మించబడిన రహదారిలో ప్రయాణాలు సుఖంగా సాగుతున్నాయి.

ప్రమాద రహితంగా..

అన్ని హంగులతో నిర్మించిన ఈ రహదారిలో ప్రయాణం చాలా సులభంగా, సౌకర్యంగా ఉంటుంది. ప్రధాన కూడళ్ల వద్ద సిగ్నల్ లైట్లు, ప్రమాదకరమైన ప్రదేశాల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. దీంతో ప్రమాద రహితంగా తీర్చిదిద్దబడింది. అధునాతనమైన పద్ధతుల్లో, పూర్తి నాణ్యతా ప్రమాణాలతో ఈ రోడ్డును నిర్మించారు.

మర్యాదపూర్వకంగా..



రాజమహేంద్రవరం సిటీ: నగరంలో శుక్రవారం జరిగిన బీసీ సంక్షేమ సంఘం జాతీయ కార్యవర్గ సమావేశానికి ఆ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయనను రాజమహేంద్రవరం ఎంపీ, వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ చీఫ్ విప్ మార్గాని భరత్ రామ్ మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.

నేడు విద్యుత్ అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: మార్కండేయ ఫీడర్‌కు వార్షిక మరమ్మతుల నేపథ్యంలో శనివారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ విద్యుత్ అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ నక్కపల్లి శామ్యూల్ తెలిపారు. నగరంలోని కంభం వారి సత్రం, వంకాయల వారి వీధి, మెయిన్ రోడ్డు, ఉల్లితోట వీధి, టౌన్ హాల్ రోడ్డు, మెరక వీధి, టి.నగర్, అజ్జరపువారి వీధి, బారువారి వీధి, వైగ్రామ్ రోడ్డు, చల్లపల్లి వారి వీధి, న్యాపతి వారి వీధి, ఇస్కాన్ టెంపుల్, గోదావరి బండ్, శివరామ కలర్ ల్యాబ్ ఏరియా, కోటిపల్లి బస్టాండ్, కొత్తపేట, మంగళవారపు పేట, భారత్ బొమ్మలు రోడ్, ట్రైనింగ్ కాలేజీ, నాగులు చెరువు బజార్, కొబ్బరి కాయల మార్కెట్, నెహ్రూ జంక్షన్, నేతాజీ స్కూల్ సెంటర్, భావనా ఋషి గుడి, ఇసుక వీధి, నాళం భీమరాజు వీధి, రంగ్రీజు పేట, చందా సత్రం, గుండువారి వీధి, సదనం, గోదావరి బండ్, వంకాయలవారి వీధి, పుష్కరఘాట్ ఏరియాల్లో సరఫరా ఉండదన్నారు.

మార్క్స్ సిద్ధాంతమే ప్రపంచానికి దిక్సూచి

ప్రకాశం నగర్: మార్క్స్ సిద్ధాంతమే ప్రపంచానికి దిక్సూచి అని ఇన్సూరెన్స్ ఉద్యోగుల సంఘం సౌత్ సెంట్రల్ జోన్ అధ్యక్షుడు పి.సతీష్ అన్నారు. పేపర్ మిల్లు వద్దగల బీటీఆర్ భవన్‌లో శుక్రవారం కారల్ మార్క్స్ జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్థిక మాంద్యం, ప్రపంచ దేశాలు అనే అంశంపై సీఐటీయూ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సదస్సు జరిగింది. కారల్ మార్క్స్ చిత్రపటానికి పలువురు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సదస్సుకు సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు టి.అరుణ్ అధ్యక్షత వహించారు.

వ్యక్తి మృతదేహం లభ్యం

కంబాలచెరువు: స్థానిక పీవీ నర్సింహారావు పార్కు వద్దఉన్న గోదావరిలో గుర్తు తెలియని సుమారు 30 నుంచి 35 వయసున్న వ్యక్తి మృతదేహాన్ని శుక్రవారం గుర్తించారు. స్థానికుల సమాచారం మేరకు ఆ ప్రాంతానికి చేరుకున్న పోలీసులు..మృతదేహాన్ని తీసి పోస్టుమార్టం కోసం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

దేవాలయాలకు శంకుస్థాపన

మధురపూడి: మండలంలోని పలు గ్రామాల్లో దేవాలయాల నిర్మాణానికి శుక్రవారం శంకుస్థాపనలు జరిగాయి. వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు నిర్వహించారు. మునగాల, శ్రీరంగపట్నం గ్రామాల్లో గణపతి ఆలయాలు, రాఘవపురం, గాదరాడల్లో రామాలయాల నిర్మాణానికి శంకుస్థాపనలు చేశారు.